## క్లుప్తంగా

### నిత్యాన్నదానానికి విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ శాశ్వత నిత్యాన్నదాన ప్రసాద వితరణకు పట్టణానికి చెందిన గొట్టుముక్కల సత్యనారాయణరాజు, శైలజ దంపతులు రూ.25 వేలు, గొట్టుముక్కల వెంకట పవన్ కుమార్, శ్వేత దంపతులు రూ.25 వేలు, భూపతిరాజు ఆనంద్ విజయ వర్మ, శ్రీలలిత రూ.25 వేలు, వేగేశ్న రాజంరాజు, లీలాకుమారి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి, నగేష్ ప్రసాదాలు, శేష వస్త్రం, ఫోటో అందించారు.

### ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

వీరవాసరం: సమాజ సేవలో ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని ఏబీవీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తోట సత్య కళ్యాణ్ కోరారు. ఏబీవీపీ (అఖిల భారత విద్యార్థి పరిషత్) 76వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని వీరవాసరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విద్యతోపాటు దేశభక్తి కలిగి ఉండాలని కోరారు. విద్యార్థులతో కలిసి ఏబీవీపీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం, విద్యార్థుల కోసం ఏబీవీపీ చేసిన ఉద్యమాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు, అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న రాజ్‌కుమార్

ఆకివీడు: మానవత్వాన్ని చాటుకుంటూ తనకున్నంతలో అనాథలు, బిక్షగాళ్ల ఆకలి తీర్చాలని స్థానిక యువకుడు ఎరిచెర్ల రాజ్‌కుమార్ నిర్ణయాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. స్థానికంగా కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నడుపుకుంటూ యువతకు శిక్షణ ఇస్తున్న రాజ్‌కుమార్ బుధవారం సుమారు 50 మంది బిక్షగాళ్లకు భోజన, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి ధాతృత్వాన్ని చాటుకున్నారు.

### దాతల సహకారంతో జెడ్పీ హైస్కూల్ అభివృద్ధి

ఉండి: దాతల సహకారంతో ఉండి జెడ్పీ హైస్కూల్‌ను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. బుధవారం ఉండి పర్యటనలో జెడ్పీ హైస్కూల్, అబ్బాయిరాజు పార్క్‌లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి జడ్పీ హైస్కూల్‌ను దాతల నుంచి రూ.15 నుంచి రూ.20 లక్షలు సేకరించి పాఠశాలలో మౌలిక వసతులను కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవాని తిప్ప విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో గురువారం 11 కేవీ విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ బుధవారం తెలిపారు. గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**ఉండిలో..**

ఉండి: యండగండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం చేపట్టనున్నారు. దీంతో మండలంలోని వెలివర్రు, చిలుకూరు, యండగండి, ఉణుదుర్రు గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ విద్యుత్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, భీమవరం ఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### భీమవరంలో వేద సభ

భీమవరం (ప్రకాశంచౌక్): రెండో పట్టణంలోని గొట్టిముక్కల వారి తోటలోని శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీశారద మాత వేదమాత సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్ వారి శ్రీపాద కృష్ణమూర్తి ఘనాపాఠి స్మారక వేద సభ నిర్వహించారు. వేద సభలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పాల్గొన్నారు. గొట్టుముక్కల విష్ణుమూర్తి రాజు, సురేష్, పెన్మెత్స సుబ్బరాజు, కాశీ విశ్వనాథం, పెన్మెత్స రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

- రెప రెపలాడిన ఎర్రజెండా
- డిమాండ్ డే విజయవంతం



ఆకివీడు: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉండి: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను, వారి హక్కులను కాపాడాలని సీఐటీయు జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. బుధవారం డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వంగా మూడోసారి కొలువు దీరిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక విధానాలు విడిచి పెట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంతే కాకుండా కార్మికులకు పీఎఫ్ సకాలంలో చెల్లించని సంస్థలకు 25 శాతం విధించే జరిమానాను 5 శాతానికి తగ్గించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికులను వెంటనే ప్రభుత్వోద్యోగులుగా గుర్తించి వారికి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్‌బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఓల్డ్ పింఛన్ స్కీము స్థానంలో తీసుకు వచ్చిన కొత్త స్కీమును రద్దు చేసి పాత విధానంలో పింఛన్ స్కీమును అమలు చేయాలన్నారు. అలాగే స్కీం వర్కర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను అందించాలన్నారు. ఇప్పటికైనా ప్రజలు, కార్మికుల పక్షంగా పాలన చేయాలన్నారు. లేకుంటే దేశ వ్యాప్తంగా ప్రజల మద్దత్తుతో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నమిమతి కిశోర్, వీరవల్లి శ్రీనివాస్, కడిలి నాగేశ్వరరావు, మజ్జి నాగేశ్వరరావు, వంజరపు సూర్య నారాయణ, కట్టా రవి, అంగన్వాడీలు గడి కుసుమ, ముదునూరి ఝాన్సీ, జయశ్రీ, వి.రాణి, వీరవల్లి వెంకటలక్ష్మీ, కె.అన్నపూర్ణ, రత్నం, కనకలక్ష్మీ, సుబ్బలక్ష్మీ, గోవింద కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: దేశ వ్యాప్తంగా డిమాండ్స్ డే విజయవంతమయ్యింది. దీంతో దేశ వ్యాప్తంగా ఎర్ర జెండా రెపరెపలాడింది. ఈ కార్యక్రమంలో కార్మికుల కడుపు కొడితే ఖబడ్దార్ అంటూ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెఎన్వీ గోపాలన్ హెచ్చరించారు. దేశ వ్యాప్త డిమాండ్స్ డే నిరసన ధర్నా స్థానిక తహసీల్దార్ కార్యలయం వద్ద బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి గతం కంటే ప్రస్తుతం సీట్లు తగ్గిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అవి కూడా దక్కని విధంగా పరిపాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. లేబర్ కోడ్‌ను అమలుజేసేందుకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. కార్మికులపై, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ కార్మికుల హక్కుల కోసం సంఘాలు ఏర్పరుచుకుంటుంటే, చట్టాల ద్వారా వాటిని తొలగించేందుకు దూకుడుగా వెళుతోందన్నారు. సీఐటీయూ మండల అధ్యక్షులు పెంకి అప్పారావు అధ్యక్షత వహించగా, నాయకులు కె.తవిటి నాయుడు, పైడీశ్వరి, కేశిరెడ్డి ధనరాజు, తొట పద్మ, పైలా శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం: ప్రభుత్వాలు మారినప్పటికీ శ్రామిక ప్రజల సమస్యలు ఎజెండా మీదకు రాకపోవడంతో జాతీయ కోరికల దినోత్సవం సందర్భంగా కనీస వేతనాలకు మరిన్ని పోరాటాలు తప్పవని కార్మిక వర్గం హెచ్చరించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్, పంచాయతీ కార్మికులు, వీవోఏలు, రైస్ మిల్ కార్మికులు, స్కూల్స్ స్వీపర్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించాలని, ప్రైవేటీకరణ విధానాలను పాలకులు విరమించుకోవాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకొని ప్రజల ఎజెండాను అమలు చేయాలన్నారు. కనీస వేతనాలు ఉద్యోగ భద్రత కల్పించకుండా కల్లబొల్లి మాటలు చెబితే ప్రజలు నమ్మరన్నారు. సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు డి.వరలక్ష్మి, పి.నాగరత్నం, రైస్‌మిల్లు యూనియన్ నాయకులు కె.సత్తిబాబు, మిడ్ డే మీల్ సంఘం నాయకులు మద్దాల శ్రీనివాసు, రత్నకుమారి, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు మల్లుల ఏసుబాబు, వీవోఏల సంఘం నాయకులు పి.కుమారి, బి.మాధవి, నిర్మల, సత్యవతి, శాంతి కుమారి, పాల్గొన్నారు.



ఉండి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సీఐటీయు నాయకులు



వీరవాసరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

### నేడు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఉండి: స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం గురువారం కూనపరాజు అప్పలరాజు సీతమ్మ, లయన్స్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ తెలిపారు. ముఖ్య అతిథులుగా పి.సుభాష్ బాబు, ఈపూరి సత్యనారాయణ, సీహెచ్.కృష్ణంరాజు, గొంట్ల కృష్ణమూర్తి, పి.రామమూర్తి హాజరవుతున్నట్లు తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు, ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు, ద్వారంపూడి నారాయణరెడ్డి, కోశాధికారి పి.నర్సింగరావు, క్లబ్ ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ సాగిరాజు సాంబశివరాజు, తదితరులు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు.

### పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సునీల్‌ను అభినందిస్తున్న కార్యదర్శులు

కాళ్ల: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కాళ్లకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.సునీల్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బి.సతీష్ కుమార్, కార్యదర్శిగా సీహెచ్.సుజాత, కోశాధికారిగా బి.ఏసుబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి మండల కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

### నేడు అల్లూరి శత వర్ధంతి సభ

పాలకోడేరు: తెల్ల దొరల గుండెల్లో నిదురించిన విప్లవ సింహం అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సభను జయప్రదం చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యావత్ దేశ ప్రజలకు విప్లవ జ్వాల రగిలించి, మన్యంలో గిరిజనులకు అండగా నిలిచి, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి 27 సంవత్సరాలకే వీర మరణం పొందిన అల్లూరి సీతారామరాజు మన జిల్లా వాడు కావడం మన అదష్టమన్నారు. ఆయన మరణించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం భీమవరంలోని ఐఎంఏ హాల్‌లో పీడీఎస్‌వో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శత వర్ధంతి సభకు అందరూ హాజరు కావాలని మోహన్ కోరారు. ఈ సభలో దారి దీపం పత్రికా సంపాదకులు డీవీవీఎస్ వర్మ ప్రధాన వక్తగా, పీడీసీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సురేష్, ఎన్.భాస్కర్, ఎల్.భాను ప్రసంగిస్తారని మోహన్ తెలిపారు.

## విద్యార్థులకు కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: విద్యార్థులు చక్కటి విద్యాభ్యాసంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీమన్నారాయణ తెలిపారు. వీరవాసరం మండలంలోని రాయకుదురు, కొణితివాడ, అండలూరు గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాయకుదురు హైస్కూల్లో ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికై న విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ గుండా జయప్రకాష్, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, గెద్దం భారతి, కడలి నెహ్రూ, వీరవల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**విద్యా సామగ్రి అందజేత**

భీమవరం అర్బన్: మండలంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మోహన్ సీ ఫుడ్స్ అధినేత శ్రీనివాస్ బుధవారం 900 నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు బి.గోవర్ధిని

ఆకివీడు: డెంగీ, డయేరియా, మలేరియా, పైలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యురాలు బీ.గోవర్ధిని పిలుపునిచ్చారు. మండలంలోని సిద్ధాపురంలో బుధవారం అంటువ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే అంటువ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. మురుగు నీరు, అపారిశుద్ధ్యం వంటి వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం వలన వ్యాధులకు దూరంగా ఉంటారని చెప్పారు. ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లు వంటి వాటిలో నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమలు పుట్టుకు వస్తాయని గోవర్ధిని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌పీ హెచ్, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కో ఆర్డినేటర్స్

భీమవరం: పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు ఉండకూడదని, మధ్యాహ్న భోజన, పారిశుద్ధ్య జిల్లా కోఆర్డినేటర్స్ కె.కృష్ణారావు, జి.చిన్నయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీభాయి(జేఎల్‌బీ) మున్సిపల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలోని బియ్యం, గుడ్లు, చిక్కీల నిల్వలను పరిశీలించారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం పీబీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ జాగృతి క్లబ్ సేవలు ఆదర్శనీయం



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో టూ టౌన్‌లోని గాలి రామయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు, అంగన్‌వాడీ చిన్నారులకు స్టీల్ కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన టుటౌన్ ఎస్సై రమేష్, ప్రభుత్వ ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ వీరాస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం అందించడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారం అభినందనీయమన్నారు. వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు పత్రిపాటి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం పలువురికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో నాగసూరి మురళి, సబ్బిశెట్టి శ్రీనివాస్ గణేష్, సంక అనంతగోపాలం, సమయమంతుల నాని, ఆలపాటి హరి నారాయణ, అల్లు శ్రీనివాస్, సమయమంతుల శ్రీయ, ఉప్పల నర్సింహమూర్తి, ఆలపాటి భాస్కరరావు, స్కూల్ హెచ్ఎం కవురు దేవి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయవాది నార్కిమెల్లి సుధీర్



పెదఅమిరంలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అడ్వకేట్

కాళ్ల: ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడ్వకేట్‌లు తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, భీమవరం వారి ఆదేశాల మేరకు బుధవారం పెదఅమిరం గ్రామ సచివాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్స్ పులిదిండి అంబేద్కర్ మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994ను వివరించారు. నార్కిమెల్లి సుధీర్ మాట్లాడుతూ మహిళా చట్టాలు, సామాజిక న్యాయం గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.సుధీర్, పులిదిండి అంబేద్కర్, బి.సునీల్ కుమార్, సర్పంచ్ సోమేశ్వరరావు, వీఆర్వో హరి రామ్ కుమార్, ప్యార లీగల్ వాలంటీర్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణం అడ్డుకోవడంపై ఫిర్యాదు



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందిస్తున్న విశ్వ హిందూ పరిషత్ నాయకులు

భీమవరం: వీరవాసరం మండలం మడుగుపోలవరం పంచాయతీ పరిధిలోని జొన్నలపాలెంలో రామాలయం పునర్నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఒబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు మాట్లాడుతూ జొన్నలపాలెంలో రామాలయ పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయగా నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. అయితే గ్రామంలోని కొందరు అక్రమంగా రామాలయం స్థలంలోకి చొరబడి గుడి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్నారు. గుడి నిర్మాణాన్ని అడ్డుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు పల్లా సర్వారాయుడు, అఖిల్, గరికిముక్కు సుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

## రజకుల చెరువు వేలం పెంచడం అన్యాయం



నిరసన తెలుపుతున్న రజకులు

పాలకోడేరు: ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా రజక వృత్తిదారుల చెరువులపై గ్రామ పంచాయతీలు అధిక లీజుల భారం మోపుతున్నారని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. మోగల్లులో రజకుల చెరువు వేలం మొత్తాన్ని పెంచడం అన్యాయమని బుధవారం రజకులు నిరసన చేస్తున్న కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ చెరువు రూ.21 వేలకు వేలం నిర్వహించేవారని, దానిపై నాలుగు శాతం మాత్రమే పెంచాల్సి ఉండగా, అధిక మొత్తం పెంచడంతో రజకులు తీవ్రంగా నష్ట పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి రేటు పెంచినప్పుడు డీఎస్‌పీవో నుంచి పంచాయతీకి సమాచారం వస్తుందని, దాన్ని 15 రోజుల ముందు రజక సంఘానికి నోటీసు ఇవ్వాలన్నారు. చాలా చోట్ల పంచాయతీ కార్యదర్శులు నిబంధనలు పాటించడం లేదని దీని వలన రజకులు నష్ట పోతారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడామని అధిక మొత్తం పెంచడానికి వీల్లేదని పంచాయతీ అధికారులతో మాట్లాడతానని వివరణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కొమరపురి సూర్యనారాయణ, బాలరాజు, అంజూరి చిన్నారావు, చిటికెల సురేష్, పొన్నాడ శ్రీనివాస్, యలమంచిలి పెద్దింట్లు, జయలక్ష్మి, మంగతాయారు, అప్పల నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### పాము కాటుతో రైతు మృతి

పాలకోడేరు: పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే శృంగవృక్షంలోని చినపేటకు చెందిన దుండి.లక్ష్మణరావు పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు.బుధవారం పొలం వెళ్లగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. కొద్ది సేపటికి లక్ష్మణరావు మృతి చెందాడు. కుమారుడు రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**చిలుకూరులో చోరీలు**

ఉండి: మండలంలోని రైతుకు చెందిన పొత్తూరి ఫణివర్మ ఆక్వా సాగు చేస్తున్న చెరువుపై నాలుగు విద్యుత్ మోటార్లు, విద్యుత్ కేబుల్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు రైతు తెలిపారు. సుమారు రూ.లక్ష విలువైన సొత్తు అపహరణకు గురయ్యిందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు. గ్రామంలోని పైడమ్మ ఆలయం వద్ద సీసీ కెమెరాలను గుర్తు తెలియని దుండగులు అపహరించారని గ్రామ సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు తెలిపారు. ఘటనపై ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

**వరకట్న వేధింపులపై కేసు నమోదు**

ఉండి: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు భరించలేకపోతున్నానంటూ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం ఆకివీడు మండలం మందపాడుకు చెందిన గూడవల్లి అనిత ఉండి గొడపేటకు చెందిన కోటేష్‌బాబుతో 2023లో వివాహమయ్యింది. కట్నంగా రూ.2లక్షల నగదు, రూ.60వేలు ఆడపడుచు కట్నంగా అందించారు. అదనపు కట్నం తేవాలని భర్త, అత్తమామలు, ఆడపడుచు వేధింపులకు గురిచేస్తున్నారని మహిళ ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు.